సాక్షి

అన్నమయ్య జిల్లా

సోమవారం । 5 । మే । 2025



వైభవోపేతం త్రిశూల, చక్రస్నానం

పుష్పగిరిలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం త్రిశూల, చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగిశాయి. -8లో



క్రెడిట్ కార్డు బిల్లు కట్టమన్నందుకు..

క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించకపోవడంతో, బ్యాంక్ సిబ్బంది ఇంటివద్దకు వచ్చి నిలదీయడంతో అవమానంగా భావించి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.92
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 444 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి టౌన్: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటితో పాటు అన్ని మండలాల, గ్రామాల, డివిజన్ స్థాయి స్థాయి నుంచి వచ్చే సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన నియామకం



లోకేశ్వరరెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె డీవైఈఓ(ఫుల్ అడిషనల్ చార్జి) గా పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు మదనపల్లె డీవైఈఓగా ఉన్న కుమార్ను తిరుపతి డీఈఓతో పాటు అదే కార్యాలయం లో అడిషనల్ డెరైక్టర్ గా నియమించారు. దీంతో ఖాళీగా ఏర్పడిన మదనల్లె డీవై ఈఓ స్థానంలో లోకేశ్వరరెడ్డిని నియమించారు.

9న ఊటీకి ప్రత్యేక బస్సు



మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 9వతేదీన ఊటికి ప్రత్యేక బస్సు సరీ్వసు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం అమరనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. 9న ఆర్టీసీ డిపో–2 నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి బెంగళూరు,మైసూర్ మీదుగా 10వతేదీ తెల్లవారుజామున ఊటీకీ చేరుతుందన్నారు. 11వతేదీ ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకార షూటింగ్‌స్పాట్, ముదుమలై ఫారెస్టు, బండిపూర్ ఫారెస్టు మీదుగా మైసూర్ వెళ్లి ప్యాలెస్, జూపార్కు,బృందావన గార్డెన్స్ చూసిన తరువాత అదే రోజు రాత్రి బయలుదేరి 12వతేదీ తెల్లవారుజామున మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.2800గా నిర్ణయించినట్లు చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సు సీట్లు 35 ఉంటాయన్నారు. యాత్రకు వెళ్లాలనుకునేవారు ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గంగమ్మా.. కాపాడవమ్మా..



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి: గంగమ్మ తల్లీ...వర్షాలు కురిపించి కరుణించి కాపాడవమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.కొందరు బోనాలు సమర్పించారు.మరికొందరు తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు, రేపు వ్యవసాయ పరిశోధన మండలి సమావేశం




ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నేడు, రేపు దక్షిణ మండలి పరిశోధన , విస్తరణ సలహా మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్యకుమార్‌లు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని వ్యవసాయ జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఐదు జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో 2025–26 సంవత్సరానికి చేపట్టబోయే కార్యచరణ, ప్రణాళిక మీద సమీక్ష నిర్వహించడం జరుగుతుందని వారు వెల్లడించారు.

- మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన కిషోర్‌కు ఒక కూతురు. మూడో తరగతి పూర్తి చేసిన ఆ పాపను ఓ కార్పొరేట్ బడిలో చేర్పిద్దామని ఇటీవల అక్కడికి వెళ్లగా నాలుగో తరగతి ఫీజు రూ.62 వేలుగా తేల్చేశారు. మూడో తరగతికి కిషోర్ కట్టిన ఫీజు రూ.36 వేలు, ఏకంగా రెట్టింపు అడగడంతో కంగుతిన్న కిషోర్ కొత్త బడిలో చేర్పిద్దామనే ఆలోచనకు స్వస్తి పలికి పాత పాఠశాలలోనే కొనసాగించాలనే నిర్ణయానికొచ్చారు.
- వాల్మీకిపురం కోనేటికట్టకు చెందిన శ్రీనివాస్ తన మూడేళ్ల కొడుకును ప్లే స్కూల్‌లో చేర్పిద్దామని వెళ్లగా ఏడాదికి ఫీజు రూ.30 వేలు అని చెప్పింది స్కూల్ యాజమాన్యం. వచ్చే విద్యా సంవత్సరం(2025–26)కి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఆలస్యమైతే మరో రూ.5 వేలు ఎక్కువవుతాయని చెప్పగా తొలి దశ కింద రూ.10వేలు కట్టి అడ్మిషన్ ఖాయం చేసుకున్నారు.
- కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన శశివర్ధన్,శ్వేత దంపతులకు ఇద్దలు పిల్లలు. సీబీఎస్ఈ సిలబస్ ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీలో తన కుమారుడిని చేర్పించడానికి ఫీజుల వివరాలు ఆరా తీశారు. ఏడాదికి రూ.56 వేలు ఫీజు, రవాణా,యూనిఫాం , ఇతర ఖర్చులు అదనమని చెప్పడంతో తక్కువ ఫీజు ఉన్న ఇతర పాఠశాలలో చేర్పించాలని నిర్ణయానికి వచ్చారు.

ఫీజులుం..

- ప్రవేశాలు ప్రారంభించిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు
- ఈ ఏడాది అన్ని తరగతులకు 40 శాతం పైనే పెంపు
- రవాణా, యూనిఫాం, ఇతర ఖర్చులు అదనం





మదనపల్లె సిటీ: వచ్చే విద్యా సంవత్సరానికి జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలలు ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించాయి. ఇది వరకకే తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి 40 శాతానికిపైగా ఫీజులు పెంచుతూ వారి తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సమాచారం పంపుతున్నాయి. దీంతో ఇప్పటి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల భయంతో బెంబేలెత్తుతున్నారు. పోటీ ప్రపంచంలో బడి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఫీజులు పెంచినా తప్పనిసరిగా చెల్లించే పరిస్థితి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.జిల్లాలో మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట ప్రాంతాల్లో సీబీఎస్ఈ కింద ఎల్‌కేజీలోనే ప్రవేశాలకు దాదాపు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో వసతులు, సౌకర్యాలను బట్టి ఇవి మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పాఠశాలకు రవాణా సౌకర్యం,యూనిఫాం , పాఠశాలల్లో ప్రత్యేక రోజుల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్షల రుసుం తదితర వాటికి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. వెరసి ఒకటో తరగతి చదివే విద్యార్థికి ఏడాదికి సగటున రూ.80వేలు వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి.

కనిపించని ఫీజు బోర్డులు



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు బోర్డులు ఎక్కడా కన్పించడం లేదు. ఏ తరగతికి ఎంత ఫీజు వివరాలు ఆయా పాఠశాలల్లో బోర్డుల్లో కనబరచాలి. అలాంటిది ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

చర్యలు తీసుకోవాలి



అధికంగాఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. వేసవి సెలవుల్లోనే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నారు. ఫీజులతో పాటు అదనంగా పుస్తకాలు వంటి వాటి పేరుతో అధికంగా డబ్బులు గుంజుతున్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే

దండన తప్పదు

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



విద్యాసాగర్‌నాయుడు, జిల్లా ఎస్పీ

రాయచోటి: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారి పట్ల కఠినదండనలు తప్పవని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. విదేశ పర్యటన అనంతరం జిల్లా తిరిగి వచ్చిన జిల్లా ఎస్పీ జిల్లాలో చేపట్టాల్సిన శాంతిభద్రతలు, జరుగుతున్న దొంగతనాల పట్ల ప్రజల అప్రమత్తత తదితర విషయాలపై ఆదివారం పత్రికలకు అందజేసిన ప్రకటనలో విశదీకరించారు. మీ ఇళ్లు, పరిసర ప్రదేశాల్లో కనిపించే అపరిచితులను గుడ్డిగా నమ్మవద్దన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులైతే గుట్టుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. విలువైన వస్తువులు, నగలు, డబ్బు ముఖ్యమైన పత్రాలను సురక్షితమైన స్థలంలో ఉంచుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఈమెయిల్‌ల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. వ్యక్తిగత సమాచారం లేదా బ్యాంక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గొడవలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. దొంగతనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలతో సరదాగా తీర్థయాత్రలు, విహారయాత్రలకు వెళ్లడం పరిపాటి. కానీ తాళం వేసి ఉండే ఇళ్లే లక్ష్యంగా దొంగలు విరుచుకుపడి దొరికినంత దోచుకెళ్తారన్నారు. వేసవి దొంగతనాలను నివారించేందుకు జిల్లా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే వారి ఆటలు కట్టించేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశామన్నారు. ప్రజలు కూడా పోలీసుల ఆదేశాలను పాటిస్తూ ఈ వేసవికాలాన్ని సురక్షితంగా సంతోషంగా కుటుంబసభ్యులతో గడపాలని ఎస్పీ తెలిపారు.

నేరాలపై అవగాహన

నేరాల గురించి అవగాహన కల్పించేందుకు వివిధ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను నివారించవచ్చని ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటి భద్రతపై సూచనలు

ఇంటి భద్రతకు సంబంధించి ఎస్పీ కొన్ని సూచనలు చేశారు.

- బయటకు వెళ్లే ముందు ఇంటి ప్రధాన, వెనుక ద్వారాలకు తాళాలు, చుట్టూ ఉన్న కిటికీలు మూసివేయడం మర్చిపోకూడదు.
- ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి బయట ఎప్పుడూ వెలిగేలా లైట్ ఉండాలి. దీని ద్వారా ఇంట్లో ఎవరూ లేరనే అనుమానం ఎవరికి రాదు. తద్వారా జరిగే దొంగతనాలను నివారించవచ్చు.
- నివాస ప్రాంతాల చుట్టుపక్కల అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు వారికి సమాచారమివ్వాలి.
- అపరిచితులను నమ్మకూడదు. వారిని ఇంట్లోకి అనుమతించకపోవడం మరీ మంచిది.

ప్రశాంతంగా ముగిసిన నీట్–2025

- 2311 మంది విద్యార్థుల హాజరు



పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు నిరీక్షిస్తున్న అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్: నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్–2025 ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఈ పరీక్ష నిర్వహించడం తొలిసారి కావడంతో జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. నిర్దేశించిన సమయం ముగిసిన తర్వాత వచ్చిన అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు. తమ పిల్లలు పరీక్ష రాస్తుండడంతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నిరీక్షించారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు.

- జిల్లాలో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 2371 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకోగా 2311 మంది హాజరు కాగా, 60 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480మందికి గాను 468 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 480మందికిగాను 463 మంది, మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో 240 మందికిగాను 236 మంది, కేంద్రీయ విద్యాలయంలో 240 మందికిగాను 232 మంది, అంబేడ్కర్ గురుకులంలో 240కి 235మంది, చిన్నచౌకులోని వైఆర్ జెడ్పీ బాలికల హైస్కూలులో 159 మందికిగాను 154 మంది హాజరయ్యారు. కడప నగరంలోని మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 1839 మందికిగాను 1788 మంది హాజరు కాగా, 51 మంది హాజరు కాలేదు. ఇక ప్రొద్దుటూరు పట్టణంలోని ఏబీఎంపీఎల్ హైస్కూలులో 172 మందికిగాను 168 మంది, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 మందికిగాను 355మంది హాజరయ్యారు. ఈ రెండు కేంద్రాల్లో మొత్తం 532 మందికిగాను 523 మంది హాజరు కాగా, తొమ్మిది మంది హాజరు కాలేదు.

జగన్ హయాంలోనే ముస్లింలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి



ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పోలా శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నేతలు, ముస్లిం మతపెద్దలు

రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ముస్లింలకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో ఆకేపాటి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిని రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ జాహిద్‌అలీ ఆధ్వర్యంలో ముస్లింలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి బాటలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లింలకు అన్ని విధాలుగా అండగా నిలబడి, వారికి మేలు చేసే విధంగా పాలనను కొనసాగించారని గుర్తుచేశారు. అదే విధంగా ముస్లిం మైనార్టీలు వైఎస్సార్ కుటుంబానికి అండగా నిలబడుతూ వచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముస్లిం సంక్షేమ పథకాలను తుంగలో తొక్కిందన్నారు. చంద్రబాబు మాయమాటలతో ప్రజలను మోసం చేశారన్నది ప్రజలు గుర్తించారన్నారు. మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు మేలు జరిగిందంటే అది దివంగత సీఎం వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే అని అన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ జావిద్‌అలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆకేపాటి, ఎంపీలు మిధున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా కృషితో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తనకు రాష్ట్రస్థాయిలో పార్టీలో పదవి లభించిందన్నారు. ఇందుకు వారికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మసూద్‌అలీఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా, మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మునాఫ్, సర్పంచ్ మౌలాలి, నాసిర్, ముస్లిం పెద్దలు నజీర్ అహ్మమద్, షఫీ, సత్తార్‌ఖాన్, ఇలియాస్, సిద్దిక్, మొహమ్మద్‌షరీఫ్, మౌలా,హనీఫ్, షాకీర్, ఏజాజ్, బషీర్, అన్వర్, అక్తార్, ఖాదర్‌బాషా, రఫీ, మొహమ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లు తలకు చుట్టి.. జాతీయజెండాలు చేతబట్టి.. నిరసిస్తూ.. నినదిస్తూ.. అడుగులేస్తుంటే కడప గడప దద్దరిల్లింది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో వైఎస్ఆర్ జిల్లా కడప నగరం హోరెత్తింది. బీజేపీ, టీడీపీ, జనసేన డౌన్ డౌన్ నినాదాలతో ముస్లిం యువత గర్జించింది. వక్ఫ్.. మన హక్కు... నల్ల చట్టాన్ని రద్దు చేయాల్సిందే అంటూ నినదించింది. ఆదివారం కడపలో జరిగిన లాంగ్‌మార్చ్ అశేష జనంతో విజయవంతమైంది.

వక్ఫ్.. మన హక్కు

- నినదించిన ముస్లింలు.. మద్దతు తెలిపిన పాస్టర్లు
- కడప నగరంలో నిర్వహించిన లాంగ్‌మార్చ్‌కు విశేష స్పందన
- జాతీయ జెండాలు, నల్ల జెండాలు, ప్లకార్డుల ప్రదర్శన
- బీజేపీ, టీడీపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు



వైఎస్ఆర్ జిల్లా కడపలోని సెవెన్‌రోడ్స్ సర్కిల్ వద్ద సభకు హాజరైన జనం



లాంగ్‌మార్చ్‌లో పాల్గొన్న ముస్లింలు

కడప కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన లాంగ్ మార్చ్‌కు అద్భుత స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ముస్లిం, మైనార్టీలు, యువత, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున లాంగ్ మార్చ్‌కు తరలి వచ్చారు. వీరితో నగరంలోని రహదారులు కిక్కిరిసి పోయాయి. ఈ భారీ ర్యాలీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించి పాల్గొంది. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఈ ర్యాలీ వెంట అగ్రభాగాన నడిచారు. వైఎస్సార్‌సీపీతోపాటు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్‌సీపీ ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా నల్లరిబ్బన్లు చేతికి కట్టుకొని, నల్ల జెండాలు, జాతీయ జెండాలు చేతబట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. ఇంక్విలాబ్ జిందాబాద్, బీజేపీ డౌన్ డౌన్, టీడీపీ డౌన్ డౌన్, జనసేన డౌన్ డౌన్ వంటి నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. గోస్ నగర్ నుంచి ప్రారంభమైన లాంగ్ మార్చ్ మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా, శివలింగం బీడి ఫ్యాక్టరీ, అల్మాస్‌పేట సర్కిల్, చిలకల బావి వీధి, రెండో గాంధీ బొమ్మ, వన్ టౌన్ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకూ చేరింది. అక్కడ అన్ని పార్టీల నాయకులు ప్రసంగించారు. కాగా పలు సర్కిళ్ల వద్ద పలువురు స్వచ్ఛందంగా మజ్జిగ, నీళ్లు, షర్బత్‌లు పంపిణీ చేయడం విశేషం.

తెలుగుదేశం పార్టీ నేతలకు నిరసన సెగ..

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకంగా నిర్వహించే లాంగ్‌మార్చ్‌లో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ మైనార్టీ నేత అమీర్‌బాబు ఆధ్వర్యంలో వచ్చిన ఆ పార్టీ నేతలకు నిరసన సెగ తగిలింది. టీడీపీ నేతలను జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లింల గొంతు కోసిందని, టీడీపీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ పార్టీకి రాజీనామా చేసి ర్యాలీలో పాల్గొనాలని అమీర్ బాబును కోరారు. దీంతో చేసేదేమీ లేక అమీర్‌బాబు వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మత గురువు హజరత్ మహమ్మద్ అలీ బగ్దాది, పెద్దదర్గా ముజావర్ అమీరుద్దీన్, ముఫ్తీ న్యామతుల్లా, పలువురు పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు మారుపేరు 'మహర్షి'

కడప సెవెన్‌రోడ్స్: అకుంఠిత దీక్ష, పట్టుదల, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చుని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని.. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ అదితి సింగ్ తో పాటు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆశయ సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ భగీరథ మహర్షి సేవానిరతి గొప్పదన్నారు. అలాగే మన జిల్లా వాసి అయిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు సాగు నీరందించాలనే గొప్ప ఆశయంతో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి అపర భగీరథుడయ్యారని గుర్తు చేశారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపర భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాలని కోరారు. అంతకుముందు భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘ నేత అవ్వారు మల్లికార్జున, జాతీయ ఎస్టీ, ఎస్సీ సంఘం అధ్యక్షులు జెవి రమణ, పూలే విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

రాజంపేట : రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో సున్నపురాళ్లపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో హేమాద్రివారిపల్లె వాసి బి.వెంకటేశు(30) మృతి చెందాడు. శనివారం రాత్రి కదులుతున్న ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన నరసింహారెడ్డి (45), అదే గ్రామానికి చెందిన గోవర్దన్‌రెడ్డి (40) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వస్తుండగా, మార్గమధ్యంలో అంగళ్లు సమీపంలో టాటా సుమో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన ఖాదర్‌బాషా భార్య నసీమా(35) కుటుంబ సమస్యలతో ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన శంకరప్ప కుమారుడు శ్రీనివాసులు(32) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

దళితుల పట్ల వివక్ష తగదు



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎం. విశ్వనాథ

రాయచోటి అర్బన్ : రాజంపేట మండలం కూచివారిపల్లె గ్రామం దిగువ బసవనాయుడుపల్లె దళితవాడ వాసుల పట్ల కుల వివక్షత ప్రదర్శించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అరుంధతీవాడ సమీపంలోని భూములను విక్రయించుకునేందుకు దళితుల ఇళ్లు అడ్డుగా ఉన్నట్లు భావించారన్నారు. వెంటనే రంగంలోకి దిగి దళితవాడకు వెళ్లే దారిని ఆక్రమించారన్నారు. అంతటితో ఆగక దళితుల ఇళ్లు ఇతరులకు కనిపించకుండా తమ స్థలం చుట్టూ ఎత్తయిన గోడలు కట్టడం ద్వారా దళితులను వెలివేసేందుకు ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నేత సిగి చెన్నయ్య పాల్గొన్నారు.

నమో వీరబ్రహ్మేంద్ర.!



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు



విద్యుత్ దీపాలంకరణలో దేవస్థానం

- ఘనంగా ఆరాధనోత్సవాలు ప్రారంభం
- స్వామి వారికి ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అర్చనా మూర్తులకు ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమాన్ని జరిపారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

కమనీయంగా శేషవాహనోత్సవం

రాత్రి శేషవాహనోత్సవం కమనీయంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పంచ శిరస్సులు గల శేషవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠం వరకు ఊరేగించారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి ప్రొద్దుటూరు పట్టణ పరిధి గురువయ్యతోటలోని కాలేజ్ రోడ్డుకు చెందిన పేర్ల వెంకట బ్రహ్మానందరెడ్డి, గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన చేపూరి నరసింహాచారి, ఆయన భార్య విజయలక్ష్మి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం యడవల్లి రమణయ్య భాగవతార్ ఆధ్వర్యంలో హరికథా గానం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మ వారిని దర్శించుకుని తరించారు. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు.

ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందు స్వామి తదితరులు పాల్గొన్నారు.

బి.మఠం దేవస్థానంలో అభివృద్ధి భేష్

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం అభివృద్ధి భేష్‌గా ఉందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రశంసించారు. ఆదివారం బి.మఠం దేవస్థానం పరిధిలో రూ 3.40 కోట్ల నిధులతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో మఠం ప్రాకారం, కల్యాణ మండపం, టీటీడీ సదనంలో సీసీ ఫ్లోరింగ్, పోలేరమ్మ గుడి వద్ద టాయిలెట్ బ్లాక్, గుడి ఆవరణలో ఫ్లోరింగ్ తదితర పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతం కన్నా ఇప్పుడు బ్రహ్మంగారిమఠం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అందరి సహకారంతో బి.మఠం దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మఠం అభివృద్ధిలో భాగంగా తొలగించిన తాత్కాలిక బస్ షెల్టర్ స్థానంలో రూ.10 లక్షలతో త్వరలోనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే బస్ స్టేషన్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తానన్నారు.



బి.మఠం దేవస్థానంలో నూతన కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

వైభవోపేతం త్రిశూల, చక్ర స్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవుని పుష్పయాగం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం త్రిశూల, చక్ర స్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. శ్రీ వైద్యనాథేశ్వర స్వామి త్రిశూలం, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి చక్ర తాళ్వార్‌ల స్నానాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథస్వామి ఆలయం నుంచి కామాక్షీ సహిత వైద్యనాథ స్వామిని, త్రిశూలాన్ని , కొండపైనున్న శ్రీ లక్ష్మీ చెన్న కేశవ ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామిని, చక్ర తాళ్వార్‌ను మేళ తాళాలతో, డప్పువాయిద్యాలతో పల్లకిలో మోస్తూ ఊరేగింపుగా పెన్నా నది వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో స్వామి వార్ల త్రిశూలం, సుదర్శన చక్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, చందనం, నెయ్యి, పెరుగు, పసుపు, పన్నీరు, కొబ్బరి నీరుతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి చక్ర స్నానాలతో పాటు స్నానాలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున కళశాలలో ఉంచిన నవ ధాన్యపు మొలకలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నీటిలో కలిపారు. అనంతరం రెండు ఆలయాల్లో ధ్వజావరోహణం చేసి, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలను ముగించారు.

కనుల పండువగా పుష్పయాగం..

ఆదివారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామికి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో, వేద మంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి నిర్వహించిన పుష్పయాగాన్ని చూసిన భక్తులు పులకించారు. రాత్రి శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి రావణేశ్వర వాహనంపై కొలువు దీరిన శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు తిరుచ్చి వాహన సేవలో భాగంగా గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



త్రిశూలం, చక్రాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్రెడిట్ కార్డు బిల్లు కట్టమన్నందుకు..

అవమానభారంతో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)



శ్రీకాంత్ మృతదేహం

మదనపల్లె : క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించకపోవడంతో, బ్యాంక్ సిబ్బంది ఇంటివద్దకు వచ్చి నిలదీయడంతో అవమానంగా భావించి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లె పంచాయతీ జంగావారిపల్లెకు చెందిన రెడ్డెప్ప, కాంతమ్మ దంపతుల ఏకైక కుమారుడు శ్రీకాంత్(25) పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ములకలచెరువు మండలం దేవలచెరువుకు చెందిన అనిల్‌కు తనపేరుపై ఉన్న క్రెడిట్‌కార్డు ద్వారా రూ.3లక్షల రుణం తీసిచ్చాడు. అయితే, అతను సకాలంలో రుణం చెల్లించకపోవడంతో బ్యాంక్ సిబ్బంది నుంచి వేధింపులు అధికమయ్యాయి. దీంతో తాను వ్యక్తిగతంగా దాచుకున్న డబ్బులతో పాటు కొంతమేర అప్పుచేసి మూడో వంతు రుణం చెల్లించాడు. ఇంకా రూ.40వేలు చెల్లించాల్సి ఉంది. ఈ నగదు చెల్లింపు కోసం శనివారం బ్యాంక్ సిబ్బంది శ్రీకాంత్ ఇంటివద్దకు వెళ్లి వెంటనే చెల్లించాలంటూ ఒత్తిడి చేసి నిలదీశారు. దీన్ని అవమానంగా భావించి మనస్తాపంతో ఆదివారం ఉదయం ఇంటివద్దే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీకి చెందిన నాగరాజు(35) కుటుంబ సమస్యలతో భార్య మల్లీశ్వరితో గొడవపడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు, ఏప్రిల్ 28వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు.

ముక్కావారిపల్లెలో చోరీ

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కావారిపల్లె గ్రామంలో శనివారం రాత్రి కె.చెంగళరెడ్డి ఇంట్లో దొంగలు బంగారం, నగదు, పోస్టాఫీసు లాకర్‌ను దోచుకొని వెళ్లారు. చెంగళరెడ్డి గ్రామంలోని పోస్టాఫీసును తన ఇంటి వద్దే సంవత్సరాలుగా నిర్వహిస్తున్నాడు. ఇటీవలే తన కుమారుడి వివాహం అయినందున కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించారు. పది తులాల బంగారం, రెండు లక్షల రూపాయల కంటే ఎక్కువ చోరీ జరిగినట్లు చెబుతున్నారు. జాతీయరహదారి పక్కనే ఇటీవల ముక్కా భాస్కర్ రెడ్డి ఇంట్లో చోరీకి విఫలయత్నం చేశారు. అదే ఇంట్లో ఎవరూలేని విషయాన్ని గమనించి శనివారం రాత్రి కూడా చోరీకి ప్రయత్నించారు. ఎస్ఐ పి.మహేష్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

తల్లి,బిడ్డ అదృశ్యంపై కేసు నమోదు





రామసముద్రం : రామసముద్రం మండలం కమ్మవారిపల్లి పంచాయతీ ఎర్రబోయునిపల్లికి చెందిన గంగాధర భార్య గొర్రెల గాయత్రి (26), మూడేళ్ల కుమారుడు అఖిల్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా ఆచూకీ లభిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి

సింహాద్రిపురం : వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన సింహాద్రిపురం మండలం లోమడ గ్రామంలో జరిగింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకల నారాయణ (53) గొర్ల కాపరిగా వెళ్లేవాడు. రోజు మాదిరిగా ఆదివారం ఆయన గొర్రెలను మేపేందుకు వెళ్లాడు అక్కడ తీవ్ర వేడికి వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయి పడిపోవడంతో తోటి కాపర్లు వెంటనే ఆటోలో తొండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి దారుణ హత్య



ధారా మునయ్య (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చేనువారిపల్లె గ్రామానికి చెందిన ధారా మునయ్య(48) అనే వ్యక్తి గత నెల 29వ తేదీన కనిపించకుండా పోయినట్లు కేసు నమోదు కాగా ఆదివారం హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఒంటిమిట్ట సీఐ బాబు వివరాల మేరకు.. గతనెల 29వ తేదీన మండల పరిధిలోని మలకాటిపల్లె గ్రామంలో చీరాల అచ్చమ్మ అనే మహిళ దహన సంస్కారాలకు ధారా మునయ్య బైక్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా ఉదయం 11 గంటలకు మంటపంపల్లి వద్ద అదృశ్యమయ్యాడు. అతని ఫోన్ సిగ్నల్ అందకపోవడం.. ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు దహనం చేసిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చింతరాజుపల్లి -బోయపల్లి శివారులో చూసిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దహనం చేసిన మృత దేహాన్ని పరిశీలించగా మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు లభించడంతో అది ధారా మునయ్య మృతదేహంగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, కాల్చేసి ఉంటారనే కోణంలో రిమ్స్ నుంచి వైద్య బృందాన్ని పిలిచి సంఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ బాబు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మునయ్య హత్యకు వివాహేతర సంబంధాలే కారణమని తెలుస్తోంది.

ఎయిర్ పోర్టులో నిందితుడి అరెస్టు

కురబలకోట : పరారీలో ఉంటూ లుక్ అవుట్ నోటీసు జారీ చేయబడిన రామకృష్ణ అనే నిందితుడిని ముదివేడు పోలీసులు హైదరాబాదులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇదివరకు అంగళ్లు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా ఉండి ప్రస్తుతం నగిరి బ్రాంచ్‌లో పనిచేస్తున్న గాయత్రి ఇతనిపై 2021లో వరకట్నం కేసు పెట్టింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇతను పరారీలో ఉన్నాడు. దుబాయ్‌కు వెళ్లిపోయాడు. శనివారం ఇతను శంషాబాద్ ఎయిర్ పోర్టులో దిగాడు. లుక్ అవుట్ నోటీసు ఉండడంతో ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు కస్టడీలోకి తీసుకుని ముదివేడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి అతన్ని అరెస్టు చేసి తీసుకు వచ్చారు. ఆదివారం రిమాండుకు తరలించినట్లు ముదివేడు ఎస్ఐ తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిందితుడిని అరెస్టు చేసిన ముదివేడు పోలీసులు

గాయపడిన వెటర్నరీ అసిస్టెంట్ మృతి



రెడ్డిఖాదర్‌బాషా (ఫైల్)

కలకడ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వెటర్నరీ అసిస్టెంట్ మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన మురాషా కుమారుడు రెడ్డి ఖాదర్ బాషా(29) కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ-కేవీ పల్లె మండల సరిహద్దు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఖాదర్‌బాషాను కలికిరి మండలం మహల్ ప్రభుత్వ ఆసుత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య షేక్ అఫిజున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు గ్యారేజీలో అగ్నిప్రమాదం

రూ.లక్ష ఆస్తి నష్టం



ప్రశాంత్ నగర్ కారు గ్యారేజీలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్ రెండో మెయిన్ మహ్మద్ రఫీ కారు గ్యారేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప తెలిపారు. ఆదివారం ఉదయం 8.20 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. అయితే అప్పటికే కారు గ్యారేజీ, టాటా నెక్సాన్ కారు ముందరి భాగం, ఆయిల్, టైర్స్, టూల్స్ మంటల్లో కాలుతున్నాయన్నారు. వెంటనే సిబ్బంది మంటలను ఆర్పివేశారన్నారు. ప్రమాదానికి కారణం తెలియలేదన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు పంచాయతీ పరిధిలోని తిప్పరాజుపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి నాగమునిరెడ్డికి చెందిన గేదె ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఊరి బయట ఉన్న పొలాల్లోకి మేత కోసం వెళ్లి పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురైంది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, సంబంధిత అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాత బీఎస్ఎస్ హాల్ సమీపంలో ఉన్న బాహుబలి ఫర్నీచర్ షాపులో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో షాపులోని ప్లాస్టిక్ డైనింగ్ టేబుళ్లు, చైర్లు, ఇతర వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పేశారు.

ఆటో బోల్తా - వ్యక్తి దుర్మరణం

అట్లూరు : బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ సమీపంలో కడప - బద్వేలు ప్రధాన రహదారిపై ఆదివారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం అక్కిరెడ్డిగారిపల్లె కాలనీకి చెందిన పొత్తపి చిన్నయ్య (58) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువుల వివరాల మేరకు చిన్నయ్య బద్వేలుకు వెళ్లి సెల్‌ఫోన్‌కు పౌచ్ వేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుండి బయలుదేరాడు. ఏపీ39 టీపీ 6930 నెంబరు గల ఆటోలో ఎక్కి రాజుపాలెం గ్రామ సమీపానికి వెళ్లే సరికి ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎట్టకేలకు మహానాడు స్థలం ఎంపిక!

- కడప నియోజకవర్గ పరిధిలోనే నిర్వహణకు పార్టీ జిల్లా అధ్యక్షుడి పట్టు
- చివరకు కమలాపురం పరిధిలో నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్
- టీచర్స్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ భూమిలో ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, కడప : కడప నియోకవర్గంలోనే మహానాడు నిర్వహణ చేపట్టాలని కొందరు, అక్కడొద్దు కమలాపురం పరిధిలో నిర్వహించడం శ్రేయస్కరమని మరికొందరు.. ఇలా ఎవరికి వారు తెలుగు తమ్ముళ్లు పట్టుబట్టారు. జిల్లాలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగా స్థల ఎంపిక టీడీపీ పెద్దలకు శిరోభారంగా మారింది. నాలుగు పర్యాయాలు పరిశీలన అనంతరం ఎట్టకేలకు పబ్బాపురం-చెర్లోపల్లె భూములల్లో నిర్వహించేందుకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు భూమి పూజ చేపట్టి జంగిల్ క్లియరెన్సుకు శ్రీకారం చుట్టారు.

ఈనెల 27న జిల్లాలో మహానాడు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే కడపలోనే చేపట్టాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పట్టుబట్టారు. ముందుగా ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనకు వచ్చారు. అక్కడ టీడీపీ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డికి చెందిన భూములు ఉండడంతో వద్దని ఎన్జీఓ ప్లాట్స్‌లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఎన్జీఓలలో అసంతృప్తి నెలకొనడం, పైగా అక్కడ నిర్వహణ కారణంగా కడప నగరంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కానున్నట్లు గుర్తించారు. ఎవరెన్ని చెప్పినా అక్కడే నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు పట్టుబట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సహా నాలుగు పర్యాయాలు టీడీపీ బృందాలు పరిశీలన చేపట్టారు. ఒక దశలో జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాల కారణంగా మహానాడు నిర్వహణపై అంతర్మథనంలో పడ్డారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్యపోరు..

వైఎస్సార్-అన్నమయ్య జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలు కూటమి సర్కార్‌లో ఉన్నారు. ఈ మారు మహానాడు వైఎస్సార్ జిల్లాలో చేపట్టి పట్టు చేజారిపోకుండా జాగ్రత్త పడాలనే దిశగా సీఎం చంద్రబాబు అడుగులు వేశారు. తొలి అడుగులోనే టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఉన్నట్లు అధిష్టానానికి స్పష్టమైంది. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అంతా తానై వ్యవహరించాలనే ధోరణికి మిగిలిన నేతలంతా చెక్ పెట్టారు. కడప నియోజకవర్గ పరిధిలోనే మహానాడు నిర్వహించాలనే ఒంటెత్తు పోకడకు వెళ్లారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభిప్రాయం కూడా పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించినట్లు సమాచారం. జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు మహానాడు నిర్వహణ విషయంలో అధ్యక్షుడి వైఖరిపై అధిష్టానానికి పలు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఆ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్థల పరిశీలనకు వచ్చారు. ఆయన సమక్షంలో కూడా ఎన్జీఓ ప్లాట్స్‌లో నిర్వహించాలనే దిశగా జిల్లా అధ్యక్షుడు పట్టుబట్టినట్లు సమాచారం.

అధ్యక్షుడితో నిమిత్తం లేకుండా స్థల ఎంపిక..

మహానాడు నిర్వహణకు చింతకొమ్మదిన్నె మండలంలో చెర్లోపల్లె టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ భూముల్లో ఏర్పాటు శ్రేయస్కరమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆ మేరకు ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలు పరిశీలించి, పరిస్థితులను అధిష్టానానికి తెలియజేశారు.